పోటెత్తిన సముద్రం

ఇల్లిందల సరస్వతీదేవి

పెళ్లి పందిట్లో కార్యక్రమమంతా నిలిచి పోయింది. పురోహితుడు పెళ్ళికొడుకును పదవ్యాపు పీటలమీదికి రమ్మని కేకలు పెడుతున్నాడు. పందిట్లో అక్కడక్కడ ఇద్దరు ముగ్గురు [illegible] గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు.

పెళ్లికూతురు తలెత్తి పందిరి నాలుగువైపులా కలయజూస్తోంది. అరగంటకు పైగా పెళ్ళికొడుకు కోసం అంతా ఎదురుచూస్తుండే ఇంకా ఏం కావల్సింది? ఆతురతతో ఆమె తలెత్తి అక్కడినుంచే సూటిగా వీధి అరుగుమీద నిలబడి ఉన్న తండ్రివైపు చూసింది. ఇప్పటికే ఆయన జీవితంలో మూడుసార్లు నరకయాతన అనుభవించి సగం క్రుంగిపోయి ఉన్నారు. ఈసారి ఆయనకు ఓపికంతా నశించిపోయినట్టుంది. తీగలా పడి స్తంభానికి ఆనుకుని నిలబడిపోయాడు. నాలుగుసార్లు తల్లి ఆయన దగ్గరికి వచ్చి చెయ్యి పట్టుకుని బ్రతిమాలాడింది.

"మనిద్దరం విడిదిలోకి వెళ్ళి పెళ్ళికొడుకు తల్లిని పిలుచుకువద్దాము రండి"

"ఏం లాభం? ఆమె కోరికలను నీవు తీర్చగలవా?"

"అయినా మనంవెళ్ళి అడిగితే ఏమంటుందో? రండి వెళ్దాము"

వసుంధర తల్లిదండ్రుల మాటలు ఆలకిస్తున్నది. ఏం జరిగింది అసలు? పెళ్ళికొడుకు ఎందుకు రాడు? కొంపతీసి అలిగి కూర్చోలేదు కదా? అంతకు ముందు అతడు కట్టిన మంగళసూత్రాలను తడిమి చూసుకుంది.

పాపాయమ్మ బలవంతంచేసి ఆయనను కదిలించింది.

తల్లివెంట ఉత్తరీయం సవరించుకుంటూ తండ్రి వెళ్తుంటే వసుంధరకు జాలేసింది. జడ ముందుకు వేసుకుని చేమంతి పూరేకులు ఒక్కొక్కటే ఊడదీస్తూ పెళ్ళికొడుకు నరసింహాన్ని గురించి ఆలోచిస్తోంది.

తల వంచుకుని కొంగువేలికి చుట్టుకుంటున్న తనను ఆ నాడు ఎంత విశాలంగా ప్రేమతో ఆసక్తితో చూశాడు! ఆ చూపులో ఎంత స్వాతంత్ర్యము ఎంత తీపి కనబడ్డాయి? పెళ్ళి జరుగుతుంటే మధ్యలో ఎవరయినా పీటలమీదనుంచి లేచి రమ్మంటే లేచివెళ్లే పెళ్ళికొడుకేనా అయితే? ఇటువంటి వ్యక్తితో తన భావిజీవితం ఎట్లా గడుస్తుంది?

రాణి గబగబా పరుగెత్తుకుంటూ వచ్చింది.

"అక్కయ్యా నిన్ను అమ్మ పిలుస్తోంది"

"అమ్మా నాన్నా ఎక్కడికో వెళ్ళారు. అప్పుడే వచ్చారా?"

"అప్పుడే వచ్చేశారు"

"నే నెందుకే ఇప్పుడు లోపలికి? అందరూ ఏంచేస్తున్నారు?"

"ఇంకా ఎవరూ కాఫీ తాగలేదు. టిఫిన్ తీసుకోలేదు"

"నే నిప్పుడు ఇక్కడినుంచిలేస్తే బాగుండదు. అందరూ ఇటే చూస్తున్నారు. కొంచెం సేపయిన తరువాత వస్తాను నీవు వెళ్ళు"

పిలను ఒళ్లో కూర్చోబెట్టుకుని తీరిగ్గా కబుర్లు చెబుతున్న హరిశంకరం ఒకకంట పరిస్థితులను గమనిస్తూనే ఉన్నాడు. పందిట్లోనుంచి ఒక్కొక్కరే లేచిపోతున్నారు. హరిశంకరం పందిరంతా కలయజూస్తూ వసుంధర ముఖం చూశాడు. పాలిపోయిన ముఖంతో పెళ్ళికొడుకు వచ్చేదారి వంక చూస్తోంది.

హరిశంకరం ఒక్క ఉదుటున లేచి సరాసరి విడిదిలోకివెళ్ళాడు. పెళ్ళివారు తాగివదిలేసిన కాఫీ గ్లాసులు నేలమీద దొర్లుతున్నాయి. ఉప్మా తిని పడేసిన ఆకుముక్కలు ఒకమూల కుప్పగా పడి ఉన్నాయి. ఆడవాళ్ళంతా ఒకమూలకు చేరారు. మధ్యలో వియ్యపురాలు రాజేశ్వరమ్మ కూర్చుంది కనుబొమలు ముడుచుకుంటూ. మగవాళ్ళంతా వాకిటి వరండాలోకి చేరుకుని అగ్గిపుల్లలు గీశారు.

"అయితే ఏం జరుగుతుందంటారు ఇంతకీ?"

"ఏం జరుగుతుందా? ఆ ముసలాయన అల్లుడికి నాసిరకం బట్టలు తక్కువరకం గడియారం గట్టిగా పట్టుకుంటే నొక్కుకుపోయేటట్టున్నదే ఆ పళ్ళెం చెంబు ఇచ్చినందుకు సిగ్గుపడి ఓ వెయ్యి రూపాయలు అదనంగా యివ్వవలసిందే" చేతిలో నుంచి సిగరెట్టు ముక్క విసిరిపారేశాడు వియ్యపురాలి తమ్ముడు.

పిల్లకాల్వ సవరించుకుంటూ వచ్చాడు హరిశంకరం. "ఏమిటో యీ సరసంహం? ఏమిటీ ఆలస్యం? కాఫీ టిఫిన్ అయిందా?" అంటూ మీద చెయ్యివేసి తన వైపుకు తిప్పుకున్నాడు.

"నాదేముంది? నేను రెడీ" అన్నాడు శంకరం.

హరిశంకరం బయట వరండాలో పలహారాలు చూసుకుని పెరటివైపు వరండాలోకి చూశాడు. రాజేశ్వరమ్మ నంభావికి అవి జరుగుతున్నట్లు హర్షపాన్లా ఆలోచిస్తూ గంభీరము దలో ఉన్నది. అందరూ ఆమె చుట్టూ చేరి కబుర్లలో పడ్డారు. పెళ్ళిలో ఆడపెళ్ళివారు మగపెళ్ళివారిని ఎలా లోపలో వేసుకుందీ వర్ణించి చెబుతున్నది విశాలాక్షమ్మ పండిన కేశరాశిని ఒకచేత్తో ఆడుకుంటూ.

"మగపెళ్ళివారిని మరీ అంత తక్కువగా అంటనాలేనే ఎట్లా? వీళ్ళేనా అంత తెలివితక్కువ వాళ్ళు?" ఆమెకు ఎదురుగా కూర్చున్న ఆవిడ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తోంది.

హరిశంకరం వచ్చి వరాండా చివరగా ఉన్న మెట్టు దగ్గర నిలబడ్డాడు.

"హరిశంకరం," తన బొమలు పైకెత్తి నోరు తెరిచింది రాజేశ్వరమ్మ. ఆశ్చర్యం, సంతోషం ముఖమంతా ఆవరించుకున్నాయి.

"ఏ ఊళ్ళో ఉంటున్నావు?" అన్నది లేవబోతూ. "కొంచెం ఇతనికి కాఫీ, ఫలహారం తెచ్చి పెట్టండర్రా" అంటూ అక్కడ వున్న వాళ్ళకు పురమాయించింది.

"ఇప్పుడేం వద్దండీ. అందరూ అక్కడే ఉంటారని సరాసరి పెళ్ళివారింటికే వెళ్ళాను. నాకిప్పుడు మా స్వగ్రామం దగ్గరికి ట్రాన్స్ఫరు అయింది. మీరు పంపిన ఆహ్వానము తిరిగి తిరిగి నాకు నిన్ననే చేరింది." నిలబడే మాట్లాడుతున్నాడు శంకరం వరిచేసుకుంటూ.

ఒక్కొక్కళ్ళే అక్కడ కూర్చున్న వాళ్ళంతా లేచి పక్కకు తప్పుకున్నారు. అంతలో కాఫీ గ్లాసు వచ్చింది. "కాఫీ అయినా తీసుకోవోయ్" రాజేశ్వరమ్మ బలవంతం చేసింది.

హరిశంకరం నంభావికి అనుకుని కూర్చుంటూ గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు.

"మీ ఆవిడా, పిల్లలు క్షేమంగా ఉన్నారా?"

హరిశంకరానికి ఆమె అడిగిన ప్రశ్నలో తన భార్యను ఆమె పోయించిన పురుడు జ్ఞాపకము వచ్చినది.



ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి నేఫా పర్యటన సందర్భంలో సిఇంగ్ లోయలో మిశిమి తెగకు చెందిన స్త్రీలతో వున్నప్పటి చిత్రం

"అంతా బాగున్నారు. అమ్మాయి రాజేశ్వరరావుకు మూడో ఏడు వచ్చింది."

అదేమిటా పేరు? రాజేశ్వరమ్మ ఆ మాట నోటితో అడగలేదుగాని అడుగుతున్నట్టే ఉంది ఆ ముఖం. ఆశ్చర్యం ఆనందం దోబూచులాడుతూ ముఖంమీద మెరిశాయి.

"నడకా అదీ ..." వాక్యం పూర్తి చెయ్యలేకపోయింది.

"నడకేమిటి, మాటలేమిటి దంచిపారేస్తున్నాడు. వాడి తెలివితేటలు, ఆ చురుకుదనం చెప్పలేను. వాడు వేసే ప్రశ్నలకు ఇంట్లో అందరం చిత్తైపోతున్నాం. అది పేరు మహిమ అంటుంది మా ఆవిడ." కాఫీగ్లాసు కిందపెట్టాడు.

"అహా" అన్నది తన పేరు పెట్టినందుకు లోలోపల సంతోషపడుతూ.

హరిశంకరం భార్య శకుంతల రాజేశ్వరమ్మ యింటికి పేరంటానికి వెళ్ళింది. వాళ్ళమ్మాయి పుట్టిన రోజుకు ఊళ్ళో ఉన్నా ఆడవాళ్ళంతా పేరంటానికి వచ్చారు. శకుంతల అందరికీ పసుపు, కుంకుమ యిచ్చింది. గంధం పూసి తాంబూలాలు పంచింది. ఇంకా అందరూ వెళ్ళకముందే నడుము నొప్పి అంటూ వంటింట్లోకి వెళ్ళి కూర్చుంది. ముత్తయిదువులతో కబుర్లుచెప్పి వాళ్ళను సాగనంపి రాజేశ్వరమ్మ శకుంతల కోసం ఇల్లంతా వెతికి వంటింట్లోకి వచ్చిచూసింది. శకుంతల బాధతో మెలికలు తిరుగుతోంది. ఎనిమిది గంటల రాత్రి సన్నగా వాన కురుస్తోంది. రాజేశ్వరమ్మ బంట్రోతును పంపి కారు డ్రైవరును పిలిపించింది. శకుంతలచేత వేడి వేడి పాలు ఒకకప్పు తాగించి హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళింది.

దారిలో అడిగింది రాజేశ్వరమ్మ "ఇటువంటి మనిషిని ఒంటరిగా వదిలిపెట్టి ఎలా వెళ్ళాడమ్మా మీ ఆయన?"

నడుంమీద చెయ్యివేసి రాసుకుంటూ బాధతో ముఖం చిట్లించుకుని "మొన్ననే తొమ్మిదవనెల వచ్చిందండీ ఇంకా టైముందికదా అనుకున్నారు వచ్చేటప్పుడు మా అమ్మను తీసుకు వస్తారు," ఏవీ వినబడకుండా అన్నది.

హాస్పిటల్లో డాక్టరు లేదు, సినిమాకు వెళ్ళింది. నర్సు డాక్టరుకు కబురు చేసింది. ఆ కొంచెంలోనే పెద్ద మగడాక్టరు కలెక్టరుగారి కారు చూడగానే పెద్దపెద్ద అంగలువేసుకుంటూ వచ్చాడు. రాజేశ్వరమ్మ ఆయనతో మాట్లాడుతూ ఉండగా నర్సువచ్చి చెప్పింది మగపిల్లవాడు పుట్టాడని.

రాజేశ్వరమ్మ వెళ్ళి శకుంతలను పలకరించి కావలసిన వస్తువులు పంపుతానని యింటికి వెళ్ళింది. ఎడపిల్ల లిద్దరిని ఇంట్లో అటిపెట్టుకుంది. హరిశంకరం ఊరినుంచి వస్తూనే ఆమె దగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు.

"సమయానికి మీరు ఆదుకోకపోతే శకుంతల

ఏమయిపోయేది?" ఆ మాట వదిసాక్ష్ల అన్నాడు హరిశంకరం.

"నేను ఉండగానే అంతమాట! అయినా నేను మాత్రం ఎక్కువ ఏంచేశానని?" అన్నదే కాని తాను చేసినదంతా హరిశంకరం మరో మారు చెబితే వినాలని ఉన్నట్టుగా అతడికి కనబడ్డది ఆమె ముఖంలో.

"అందరికీ మనసు స్వచ్ఛంగా మీ మనసు లాంటిది ఉంటుందా! అందరికీ దయాదాక్షిణ్యాలు మీలా ఉంటాయా!" అన్నాడు. మీరెంత అందంగా ఉంటారో మీ మనసు అంత అందమయిందని చెప్పాలని హృదయం తొందర పెటింది. మాట నాలుక చివరదాకా వచ్చింది. కాని పైకి, అనటానికి సాహసం చాలలేదు.

"పేరుకు తగిన మనసు ఇచ్చాడు దేవుడు" అన్నాడు.

రాజేశ్వరమ్మకు హరిశంకరాన్ని చూడగానే ఉత్సాహము పదింతలయింది. ఈ మాటతో పైకి ఎక్కడికో ఎగిరిపోతున్నట్టని పించింది.

శకుంతలను హాస్పిటల్ నుంచి తమకారులోనే ఇంటికి పంపించింది. దగ్గరవుండి పిల్చుకోయించింది. ఇన్నపై ఒకటోనాడు జరగవలసిన తతంగమంతా తన చేతిమీదుగా జరిపించింది.

అప్పటికి పదిరోజులకిందట చైల్డు వెల్ఫేర్ సెంటర్‌లో రాజేశ్వరమ్మ తన హోదా నంతా ఉపయోగిస్తూ పెట్టిన చివాట్లు హరిశంకరానికి జ్ఞాపకం వచ్చాయి. అప్పటికి ఊరుకొని ఆ మరునాడు అక్కడ జరిగిన బహుమాన ప్రదానంలో తీసిన ఫొటోలు ఆమె చేతికిచ్చాడు. తిప్పి తిప్పి చూసుకుంది అర గంటసేపు. మబ్బులు కమ్ముకున్న ఆకాశంలో మెరుపులా మెరుస్తోంది రాజేశ్వరమ్మ, ఆమె కట్టుకున్న జరీపూల నల్ల పట్టుచీరె తలలో పెట్టుకున్న మల్లెదండలు. చిరునవ్వు చిందిస్తున్న ఆముఖం అద్భుతంగా ఉంది ఫొటో.

ఎంత అందంగా ఉన్నా అందరి ఫొటోలు ఇంత బాగారావు అందామనుకున్నాడు కాని "మీరు ఫొటో తీసుకుంటే చాలా బాగా వస్తుంది" అన్నాడు పైకి.

రాజేశ్వరమ్మ ముఖంలో సంతృప్తితోపాటు కించిత్ గర్వంకూడా తొంగిచూసింది. ముఖం పొంగినట్లయింది. అమ్మయ్య.. నిన్నటి ఆమె కోపమంతా పోయిందన్న మాట.

హరిశంకరం చూశాడు. బిడిబిలో ఇంకా ఎక్కడి వాళ్ళక్కడే కూర్చుని అవలిస్తున్నారు.

హరిశంకరం కండువా సవరించుకుంటూ రాజేశ్వరావు పుట్టినప్పటి సంగతులన్నీ మళ్ళీ ఏకరువు పెట్టాడు. "మీమాట రోజుకు ఒక్కసారయినా జ్ఞాపకం చేసుకుంటాము అన్నట్టు మరిచిపోయానండి చెప్పటం. ఆ ఊరునుంచి బదిలీ అయినప్పుడు తీసిన ఫొటో పెద్దది చేయించి మా గదిలో పెట్టుకున్నాము. మా శకుంతల ఏం చేస్తుందంటే పొద్దున్నే లేచి తాజా మల్లెపూలతో కట్టినమాలతో ఆ ఫొటోను అలంకరిస్తుంది" అన్నాడు జేబులోంచి రుమాలుతీసి తుడుచుకుంటూ.

"ఆ ఊళ్ళో పనిచేసినట్టు మరెక్కడా పని చెయ్యలేక పోయారు. నేనయినా అనుకున్నా. ఎక్కడా మనుష్యులకు సంస్కారం లేదు" అంది.

"అదేమిటి అలా అంటున్నారు? మరీ బొత్తిగా అనాగరికంగా ఉన్నాయా ఊళ్ళు?"

"మరీ అంత అధ్వాన్నంగా లేవు. ఆ మాట కొస్తే మనమున్న ఊరికంటె బ సిలే అనుకో. అయితే అక్కడ ఒకరి సంగతి ఒకరికి అక్కర్లేదు. పెద్దా చిన్నా భేదం అంటూ లేదు. అంటూ మూతి విరిచింది.

"ఆ ఊళ్ళో మాత్రం మీ తరువాత వచ్చిన కలెక్టరుగారి భార్య ఊరి సంగతి పట్టించుకున్నదా! ఊళ్లో ఏముంది మనిషిలో ఉంది. కాని. మీ మాదిరిగా మనిషినీ మనిషినీ పలకరించి యోగక్షేమాలడిగే వారు ఎవరు? ఆ ఊరి వైభవమంతా మీతో నేపోయింది. చెప్పటం మరిచి పోయాను. మీరు ప్రారంభించిన పాఠశాలకు కోదండరామయ్యగారు పెద్ద బిల్డింగు కట్టించారు. ఆ పాఠశాలకు మీ పేరే పెట్టారు"

రాజేశ్వరమ్మ హృదయం ఉప్పొంగింది. కళ్ళు పెద్దవిచేసుకుంటూ "ఆ పాఠశాలా?" అన్నది.

పెళ్ళివారింటినుంచి ఇదరు మగవాళ్ళువచ్చి గడపలో నిలబడ్డారు హరిశంకరం ద్వారంవైపు చూడటంతో రాజేశ్వరమ్మ కూడా అటుచూసింది.

ఏమిటిసంగతి అన్నట్టు చూశాడు హరిశంకరం వాళ్ళవైపు.

"అందరూ ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమయిపోయింది."

రాజేశ్వరమ్మ ధ్యాసంతా ఆ పాఠశాలమీద ఉన్నది. హరిశంకరం అది కనిపెటి వాళ్ళవంక చూస్తూ తన సంభాషణ సాగించాడు.

"ఆ స్కూలు భవనంలో ఒక పెద్ద ఎసెంబ్లీ హాలు కట్టారు. ఆ హాలులో మీ ఫొటో లైఫ్ సైజుని పెట్టారు. దానికి జరీ జలతారు హారం వేశారు. అంత పెద్దహాలుకు ఆ ఫొటో పెట్టటంతో ఎంతో అందం వచ్చింది"

హరిశంకరం మళ్ళీ చూశాడు వాళ్ళవైపు.

ఎందుకువచ్చారు? ఏం పని? ఎవరయినా కావాలా? అడిగాడు తమ సంభాషణకు అంతరాయం వచ్చిందన్నట్టుగా ముఖంపెట్టి.

"పెళ్ళికొడుకుకోసం అంతా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమయి పోయింది"

"పెళ్ళికొడుకా? అదేమిటి పెళ్ళిపందిట్లో లేడూ!" అని వంకచూశాడు హరిశంకరం.

"ఎక్కడున్నాడో చూసి తీసుకు వెళ్ళండి" అన్నది అంతకుపూర్వం జరిగినదంతా విన్నందుచే.

"అదేమిటి మీరు రారూ? అంతా యిక్కడే ఉన్నారు"

"మేమేదో మాట్లాడుతున్నాంగా. అందర్నీ తీసుకువెళ్ళండి తరువాతసంగతిచెప్తు అన్నట్టుగా రాజేశ్వరమ్మ హరిశంకరంవైపు చూసింది.

అందరూ వెళ్ళగా చూసి హరిశంకరం మళ్లీ మొదలుపెట్టాడు.



"మీరంత పెద్ద ఫోటో ఎప్పుడు తీసుకున్నారసలు?"

"పెద్దఫోటో కావాలంటూ ఆ పాఠశాల సెక్రటరీ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. కొత్తది తీసుకుని పంపుదామా అంటే మా వారు వద్దని మా గదిలో పెట్టుకున్న ఫోటో పంపారు. నేను వద్దంటూనే ఉన్నాను సుమా. అదన్నమాట ఆ హాలులో తగిలించింది."

చాలా హుందాగా వుందిలెండి. ఆ హాలులో అక్కడ అప్పుడే ఆడపిల్లల సంఖ్య ఐదువందలు దాటింది. పల్లెటూళ్ళనుంచి కూడా వస్తున్నారు.

ఆ పిల్లలంతా ఆ హాలులో సమావేశమయి ప్రతిరోజూ ప్రార్థన చేస్తారు. ఏ మీటింగయినా ఆ హాలులోనే అవుతుంది; అక్కడున్న పిల్లలే కాదు. అధికారులకూ. వచ్చిపోయే నాయకులకూ మీ పేరు, మీ ఫోటో బాగా పరిచయమయిపోయింది."

హరిశంకరానికి ఆయన అత్తగారన్నమాట తళుక్కున స్ఫురించింది రాజేశ్వరమ్మగారి అందాన్ని ఆమె తెలివిని సంఘసేవనూ, వితరణను ఎత్తి మట్లాడాలి ఆమెతో" అతడి కళ్ళల్లో ఒక వెలుగు వెలిగింది.

రాజేశ్వరమ్మ నవ్వుముఖంతో అతడు చెప్పే కబుర్లు ఆసక్తితో వింటోంది. యాభయ్యో పడిలో ఉన్న రాజేశ్వరమ్మ పొడుగు. పొడుక్కి తగ్గ లావు. మనిషి హుందాగా ఉంటుంది. అప్పటికంటె ఆకర్షణీయంగా ఉంటుంది కనుముక్కుతీరు. ఆమె దేహచ్ఛాయ పసుపుకలిసిన తెలుపు. పదిమందిలో ఉన్నా పట్టివ్వగల సౌందర్యం ఆమెది.

"ఆ ! యింకా ఏమిటి హరిశంకరం కబుర్లు? చాలా రోజులయింది మనం కలుసుకుని." ఇక చెప్పు అన్నట్టున్నాయి ఆమె కళ్ళూ, నోరూ, ముఖం.

"ఒకరోజు ఆ పాఠశాలకు స్వామీజీ వచ్చాడు. అంటే చిన్మయానంద మఠంనుంచి. ఆయన ఉపన్యాసం యిస్తున్నంతసేపూ ఆ ఫోటో వంక చూడటం మొదలుపెట్టాడు చివరికి వెళ్ళేటప్పుడు అడిగాడు "ఏ సంస్థానం రాణీ ఈమె" అని. అక్కడున్న సెక్రటరీ చెప్పాడు. "ఇటువంటి సౌందర్యం చాలా అపురూపం. రూపానికి తగిన దొడ్డగుణం ఇంకా అపురూపం" అన్నాడు.

పైకి కనబడకుండా నవ్వును అదిమిపెట్టింది రాజేశ్వరమ్మ. ఆ ప్రశంసకు ఎంత విలువ ఉన్నదో హరిశంకరం బాగా కనిపెట్టి చూస్తున్నాడు.

"మీరు హాస్పిటల్లో కుటుంబ నియంత్రణ శాఖను ప్రారంభించారట కదూ?" అన్నాడు పెరటివైపు చూస్తూ.

"ట. ఏమిటి మీరు లేరూ?"

"నన్ను అప్పుడు ఆరు నెలలు ట్రైనింగుకు పంపారు."

"ఆఁ హాఁ అప్పుడేనా మీరు వెళ్ళింది?"

"అప్పుడేగా మీరు మా శకుంతలను వెంటబెట్టుకుని వెళ్ళి సెంటర్లన్నీ చూసింది?"

'అవు నవును, ఇంకా మీకు అవన్నీ జ్ఞాపకం ఉన్నాయా?"

"అయ్యో ఎంతమాటన్నారు ! మాకే కాదు. ఆ జిల్లా వాళ్ళంతా మిమ్మల్ని పొద్దున లేచి తలుచుకుంటారు. చేయెత్తి మొక్కుతారు."

రాజేశ్వరమ్మకు ముడుచుకుపోయిన నరాలన్నింటిలో రక్తము స్వేచ్ఛగా ప్రవహించినట్లయింది. దేహము బరువు తీసినట్లుగా తేలిగ్గా, ఉత్సాహంగా ఉంది. చాలా రోజులకు హరిశంకరం కనబడ్డాడు. ఆ ఊరి కబుర్లు అన్నీ చెబుతూ కూర్చున్నాడు. ఆ కబుర్లతో ఈమధ్య లో ఎదురయిన చికాకులన్నీ పటాపంచలై నట్లనిపిస్తోంది ఆమెకు. ఆమె మనసు ఎంతో చురుగ్గా పోటెత్తిన సముద్రం" లా ఉంది.

పెళ్ళివారింటి నుంచి మళ్ళీ ఎవరో వచ్చారు. ఆమె కెదురుగా వచ్చి నిలబడ్డారు జంకుతూ.

"ఏమిటే మళ్ళా వచ్చారేం"

"భోజనాలకు రమ్మంటున్నారు. ఇప్పటికే ఆలస్యమయింది."

"ఈ ఎండలో అక్కడికి రాలేను. మా హరిశంకరం కూడా యిక్కడే ఉన్నాడు. రాత్రి నిద్ర లేనట్టుంది. ఎండలో అంత దూరం రాలేడు. మా యిద్దరికీ భోజనం ఇక్కడికే పంపించమని చెప్పండి" హరిశంకరంవైపు తిరిగింది రాజేశ్వరమ్మ. ఆమెకు అతడంటే పుత్రవాత్సల్యము. ఆ ఊళ్ళో ఉన్నప్పుడుకూడా రోజుకొకసారయినా అతడువచ్చి ఏవో కబుర్లుచెప్పి ఒక అరగంటకూర్చుని పోవాల్సిందే. అతడు రాకపోతే ఆమె మనిషిని పంపేది.

ఇద్దరూ ఎప్పటెప్పటివో కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు. పెళ్ళి హడావిడి అయిపోయి పెళ్ళివారు వెళ్ళే అంతవరకూ హరిశంకరం విడిదిలోనే ఉన్నాడు.

పెళ్ళికూతురు వసుంధర హరిశంకరం అన్నయ్యకు కోటి నమస్కారాలు చేసింది మనసులో. ●

భర్త : (కంగారుగా) ఇదుగో ఏమేవ్, ఇట్రా! కాఫీలో ఏదోపడింది. చూడు!

భార్య : ఏం పడిందండీ!

భర్త: చీమ. చీమ!

భార్య : ఓస్ ఇదేనా! ఏదో పిడుగుపడ్డట్టు అరుస్తారేం!

కె. ఆర్. కృష్ణ. హైదరాబాద్

గాథావళి - 63

ఒక రోజు ఆదాయం

స్వీడన్ దేశస్థుడైన ఆల్ఫ్రెడ్. బి. నొబెల్ అనే మందుల వ్యాపారి చాలా గొప్ప భాగ్యశాలి. అతని సేవకులలో ఒకామె పెళ్ళిచేసుకునే ప్రయత్నంలో వున్నదని తెలుసుకొని ఆమెకు పెళ్ళికానుకగా ఏమి కావాలని అడిగాడు. దానికామె "నేనేమికోరుకోవాలో యిదివరకే నిర్ణయించుకున్నాను. కాని నేను కోరుకున్నది నాకు లభ్యమవుతుందా అని నా సందేహం" అన్నది. "అదంతా నీకు అనవసరం. ఏమికావాలో కోరుకొమ్మన్నానుగా" అన్నాడు ఉదారంగా. పనిమనిషి భయపడుతూ భయపడుతూ అడిగింది. "మీ ఆదాయంలో ఒక రోజు ఆదాయం ఇప్పించండి" అన్నది. అతను వెంటనే చెక్కు వ్రాసియిచ్చాడు. ఆ చెక్కులో వున్న అంకె రు. 1. 40, 000. లు.

— ఈరంకి

3 నెలలవరకు ఉచిత బహుమతి

స్త్రీల సౌందర్యము కాశ్మీర్ అర్ధచీరెలు. ఆకర్షణీయమైన సరికొత్త డిజైన్లు. రంగులలో సీజనులకు తాజాగా వచ్చినవి. పెద్ద సైజు. మావద్ద మాత్రమే ఉన్నవి.

వెల డీలక్స్ 1 చీరె రూ 11/-లు 2 చీరెలు రూ 20/-లు 3 చీరెలు రూ 28/-లు 4 చీరెలు రూ 36/- లు. రెండు లేక ఎక్కువ చీరెలు ఆర్డరిచ్చిన వారికి ఒక బ్లౌజు ముక్క ఉచితము. ఆర్డర్లు పోస్టు పార్సెలుద్వారా పంపబడును.

ARVIND AGENCIES (A JW-22)
P. O. Box No. 1403 Delhi-6